క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పర్యటన

బుట్టాయగూడెం: ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మంగళవారం బుట్టాయగూడెం మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు బుట్టాయగూడెం సొసైటీ పక్కన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి బాలరాజుతో పాటు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమంలో మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు పాల్గొనాలని కోరారు.

నేత్రపర్వంగా శోభాయాత్ర

జంగారెడ్డిగూడెం రూరల్: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో వాడవాడలా శోభాయాత్రలు నిర్వహించారు. ప్రముఖ హనుమాన్ క్షేత్రమైన గుర్వాయిగూడెం శ్రీ మద్ది అంజనేయ స్వామి క్షేత్రంలో రామనామ స్మరణతో శోభాయాత్ర నిర్వహించారు. అధిక సంఖ్యలో రామ భక్తులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు పాల్గొన్నారు. అలాగే శ్రీనివాసపురంలో నిర్వహించిన శోభాయాత్రలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పోల్నాటి చల్లారావు, ఆధ్యాత్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. లక్కవరంలో నేత్రపర్వంగా శోభాయాత్ర నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నరసాపురం: టి.నరసాపురం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో టి.నరసాపురం, గుర్వాయిగూడెం గ్రామాల పరిధిలో రోడ్డు క్రాసింగ్ లైన్ పనులు జరుగుతున్న కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చర్చి నిర్మాణానికి రూ.లక్ష విరాళం

లింగపాలెం: మండలంలోని ధర్మాజీగూడెంలో నూతనంగా నిర్మిస్తున్న సీఎస్ఐ చర్చి నిర్మాణానికి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్ రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతను సంఘ సభ్యులు, విశ్వాసులు సన్మానించారు. కార్యక్రమంలో మైత్రి డెవలపర్స్ అధినేత బీవీఎస్ రెడ్డి, చర్చి పాస్టర్ జగన్‌మోహనరావు, పార్టీ నాయకులు ఉప్పలపాటి గోపి, మేకల రాజు, నూతలపాటి శ్రీను, ముళ్లపూడి సుమన్ పాల్గొన్నారు.

ఎస్‌ఈబీ సీఐగా పట్టాభి చౌదరి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎస్‌ఈబీ సీఐగా వై.పట్టాభిచౌదరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన బి.శ్రీనివాసరావు నరసాపురం బదిలీ అయ్యారు. పట్టాభి చౌదరి కృష్ణాజిల్లా ముచ్చ ఎస్‌ఈబీ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యం రవాణా, అమ్మకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉండగా, జంగారెడ్డిగూడెం ఎస్‌ఈబీ స్టేషన్‌లో ఎస్సైలుగా పనిచేస్తున్న ఎ.మస్తానయ్య విజయవాడ డీటీఎఫ్‌కు బదిలీ అయ్యారు. అలాగే జె.రామ్‌ప్రకాష్ జగ్గయ్యపేట బోర్డర్ మొబైల్ పెట్రోలింగ్ పార్టీకి బదిలీ అయ్యారు. వీరి స్థానంలో రాజమండ్రి నార్త్ ఎస్‌ఈబీ స్టేషన్ నుంచి బి.అప్పారావు, ముమ్మిడి వరం నుంచి సీహెచ్ రాజేష్ ఇక్కడికి బదిలీ అయ్యారు.

పేదలకు పట్టాలు ఇవ్వాలి

లింగపాలెం: కలరాయునగూడెం ప్రభుత్వ పోరంబోకు భూమిలో పేదలకు పట్టాలు ఇవ్వాలని గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు చలగుళ్ల రవిబాబు, గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికైనా వెంటనే గత కొన్నేళ్లగా సాగు చేసుకుని జీవిస్తున్న నిరుపేదలకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని రవిబాబు కోరారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

కామవరపుకోట: కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకున్నాయని జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్, జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. సోమవారం తడికలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేయడంతో పాటు 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్తపల్లి రజిని శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2కు ఉచిత శిక్షణ

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రూప్-2 పరీక్షకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాదబాబు తెలిపారు. సోమవారం కళాశాలలో గ్రూపు-2 శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పేర్ల నమోదుకు చరిత్ర అధ్యాపకులు బి.అశోక్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, కాలేజీ ఐ క్యూ ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.మధు, డాక్టర్ సీహెచ్ బదరీనారాయణ యు.వెంకటాచార్యులు పాల్గొన్నారు.

మార్మోగిన శ్రీరామ నామస్మరణ


కుక్కునూరు: కుక్కునూరులో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


పోలవరం రూరల్: పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన రామ భక్తులు


ద్వారకాతిరుమల: సీతారాముల రథోత్సవం

ద్వారకాతిరుమల: అంతా రామమయం.. ఈ జగమంతా రామమయం. ఏ నోట విన్నా.. రామ నామమే వినిపించింది. ఎక్కడ చూసినా.. శోభాయాత్రలు, సీతారాముల కల్యాణ ఘట్టాలు కనిపించాయి. శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యలో సోమవారం బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న వేళ ద్వారకాతిరుమల క్షేత్రంలో భక్తులు శోభాయాత్ర, సీతారాముల రథోత్సవం, కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద నుంచి పెద్ద ఎత్తున భక్తులు, భజన మండలి సభ్యులు కోలాట ప్రదర్శనలు, డోలు, సన్నాయి వాయిద్యాల నడుమ శోభాయాత్ర, సీతారామ, లక్ష్మణుల రథయాత్ర ప్రారంభమైంది. ఈ యాత్ర అంబేడ్కర్ సెంటర్ మీదుగా పోలీస్ స్టేషన్ కూడలికి, అక్కడి నుంచి శ్రీవారి పాదుకా మండపం వద్దకు చేరుకుంది. ఇక్కడితో శోభాయాత్ర ముగియగా, రథయాత్ర మాత్రం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వరకు నేత్రపర్వంగా సాగింది. రథంలో కొలువైన సీత, రామ, లక్ష్మణుల ఉత్సవ మూర్తులను అధిక సంఖ్యలో భక్తులు దర్శించి తరించారు. శోభాయాత్రలో ఇద్దరు బాలలు ప్రదర్శించిన బాల రాముడు, లక్ష్మణుల వేషధారణ చూపరులను ఆకట్టుకుంది. ఇదిలా ఉంటే స్థానిక చెరువు వీధిలో ఉత్సవ కమిటీ సభ్యులు సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు పానకాలను పంపిణీ చేశారు.

ఆంజనేయుని ఆలయంలో దీప కాంతులు

అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని స్థానిక తూర్పు వీధిలోని ఆంజనేయ స్వామివారి ఆలయంలో నాయీ బ్రాహ్మణులు సోమవారం రాత్రి దీపాలను వెలిగించారు. ముందుగా వారంతా ఆలయంలో కొలువైన సీత, రామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామివార్లకు పూజాదికాలను నిర్వహించారు. అనంతరం ఆలయంలో, ఆలయం గోడలపైన దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో చిన్న, పెద్ద, యువత పాల్గొని తమ భక్తి ప్రపత్తులను చాటారు.

ఆధ్యాత్మిక శోభతో రామాలయాలు

టి.నరసాపురం: మండలంలోని రామాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఆయా ఆలయాల వద్ద రామ నామ సంకీర్తలు చేశారు. తిరుమలదేవిపేట పంచాయతీలో ఉన్న రామాలయాల్లో భక్తులు రామ సంకీర్తనలతో పాటు నగర సంకీర్తనలు చేశారు. భక్తి పారవశ్యంతో కోదండరాముడిని సేవించుకున్నారు. ప్రధానంగా టి.నరసాపురం, మక్కినవారిగూడెం, బొర్రంపాలెం, అప్పలరాజుగూడెం, బండివారిగూడెం తదితర గ్రామాల్లోని రామాలయాల వద్ద భజనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద అన్నసమారాధనలు చేపట్టారు. టి.నరసాపురం శివాలయం వీధిలోని రామాలయం వద్ద టీవీ స్క్రీన్‌ను ఏర్పాటు చేయగా, అయోధ్య బాల రాముని ప్రాణప్రతిష్ఠ లైవ్ కార్యక్రమాన్ని భక్తులు వీక్షించారు. అలాగే భక్తులు ఇళ్ల వద్దే ఉండి రామనామ జపం చేస్తూ టీవీల్లో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించారు.

అంతా రామమయం

కుక్కునూరు: అయోధ్య రామమందిరంలో సోమవారం చరిత్రాత్మక ఘట్టం బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో మండలంలోని గ్రామాలు జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగాయి. రామాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అయోధ్య నుండి వచ్చిన బాల రాముని అక్షింతలను భక్తులకు పంపిణీ చేశారు. శోభాయాత్ర నిర్వహించారు. సాయంత్రం భక్తులు ఇళ్ల వద్ద ఐదు దీపాలు వెలిగించారు. కుక్కునూరులో జరిగిన కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ సభ్యుడు బొల్లు ప్రసాద్, కివ్వాక గ్రామంలో ఆలయ కమిటీ సభ్యులు బట్టు వీర బాబు, రావి కృష్ణార్జునరావు, భక్తులు పాల్గొన్నారు.

పోలవరంలో మానవహారం

పోలవరం రూరల్: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పోలవరం గ్రామంలో సోమవారం ఉదయం నుంచి రామ భక్తులు, గ్రామస్తులు స్థానిక ఆంజనేయస్వామి ఆలయం నుంచి మోటార్ సైకిళ్లపై భారీ ర్యాలీ నిర్వహిస్తూ పోలవరం, పట్టిసీమ, గూటాల వరకు ఉన్న రామాలయాల వద్ద ఆగుతూ రామ నామస్మరణ చేశారు. స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో మానహారంగా ఏర్పడి జై శ్రీరామ్, జైజై శ్రీరామ్ అంటూ నినదించారు. అలాగే పోలవరంలోని నూతనగూడెం, పట్టిసీమ గ్రామంలో శ్రీరాముని కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలాది సంఖ్యలో భక్తులు రామనామ స్మరణ చేస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు గడిపారు. సాయంత్రం రామాలయాల్లో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్క్రీన్‌లపై తిలకించిన భక్తులు

బుట్టాయగూడెం: అయోధ్య రామమందిరంలో సోమవారం జరిగిన బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌లో భక్తులు తిలకించారు. బుట్టాయగూడెం మెయిన్ స్కూల్ సమీపంలో ఉన్న రామాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌లో భక్తులు ఈ కార్యక్రమాన్ని తిలకించారు. అదేవిధంగా జీలుగుమిల్లి కోదండ రాముని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్‌పై భక్తులు తిలకించారు. అలాగే రెండు మండల కేంద్రాల్లోని గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు.

ఇంటింటా శ్రీరామ నామస్మరణ

లింగపాలెం: అయోధ్య రామ మందిరంలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం ఇంటింటా శ్రీరామ నామస్మరణ మార్మోగింది. ఉదయం నుంచి రాత్రి వరకు దేవాలయాల్లో, గృహాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయాల్లో భక్తులకు అన్న సమారధనలు నిర్వహించారు. అన్ని గ్రామాలలో భజనలు, శ్రీ సీతారాముల కళ్యాణాలు భక్తులు నిర్వహించారు. దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

నూకాలమ్మ ఆలయంలో దీపోత్సవం

జంగారెడ్డిగూడెం: అయోధ్య రామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం స్థానిక నూకాలమ్మ ఆలయంలో దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన ఆధ్వర్యాన సభ్యులు, నూకాంబిక సేవా బృందం, భక్తులు పాల్గొన్నారు. కాగా ఈ నెల 25న ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్నట్లు రాజాన తెలిపారు.

విజయోత్సవ ర్యాలీ

అయోధ్య రామాలయంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పట్టణంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి, అనంతరం కళ్యాణం నిర్వహించారు. అలాగే అయోధ్య శ్రీరామ మందిరం ప్రతిష్ఠ మహోత్సవ విజయోత్సవ నిర్వహించారు.

అయోధ్య రామమందిరం ముగ్గు

పట్టణంలోని వివిధ గృహాల వద్ద అయోధ్య రామాలయం ఆకారంతో ప్రత్యేక ముగ్గులు వేశారు. అలాగే ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలో ప్రతి గృహం ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిశాయి.

శ్రీరాముని స్ఫూర్తితో సంక్షేమ పాలన

కామవరపుకోట: శ్రీరాముని స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్నారని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. సోమవారం శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆడమిల్లిలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ రమేష్, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్ పాల్గొని అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఉప్పలపాటి సాయిబాబు, బొల్లు వెంకట సత్యనారాయణ, ఉప సర్పంచ్ చిలుకూరి శ్రీను,వేముల సాయి, వేముల నాని, మల్లేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

అయోధ్య రామ స్మరణతో ఆధ్యాత్మిక యాత్రలు


కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలో రామ నామస్మరణతో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

కొయ్యలగూడెం: అయోధ్య రామ్ లల్లా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవ వేళ సోమవారం గ్రామాలు రామనామ సంకీర్తనతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. కొయ్యలగూడెంలో ప్రధానంగా ఉన్న నాలుగు రామాలయాలతో పాటు గ్రామంలోని ఉన్న హిందూ దేవాలయాలలో వేలాది మంది భక్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. టెంపుల్ సెంటర్స్ నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా రెండు కిలోమీటర్ల మేర వెయ్యి మందికి పైగా భక్తులు భారీ ర్యాలీ నిర్వహించి కాషాయ జండాలతో ఊరేగారు. సీతారామ లక్ష్మణ సమేత హనుమద్ ఉత్సవ మూర్తుల విగ్రహాలను పల్లకిల్లో ఊరేగించారు. పరింపూడి పంచాయతీతో పాటు 18 పంచాయతీల పరిధిలోనీ దేవాలయాలు దీపాల అలంకరణతో శోభను సంతరించుకున్నాయి.


టి.నరసాపురం: టి.నరసాపురం రామాలయంలో రామనామ సంకీర్తన చేస్తున్న భక్తులు


బుట్టాయగూడెం: జీలుగుమిల్లి రామాలయంలో స్క్రీన్‌పై విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని తిలకిస్తున్న భక్తులు


కామవరపుకోట: అఖిల గాండ్ల తెలకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


జంగారెడ్డిగూడెం: పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీరామ భక్తులు

25న వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం


నాయకులకు సూచనలిస్తున్న రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రాజబాబు

ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన తరువాత తొలిసారిగా ఈనెల 25న ద్వారకాతిరుమలకు విచ్చేయనున్న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నారు. అందులో భాగంగా స్థానిక కాపు కల్యాణ మండప ఆవరణలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు నిర్ణయించారు. సోమవారం కల్యాణ మండప ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. వేదికతో పాటు షామియానా పందిళ్ల నిర్మాణాన్ని, అలాగే 2 వేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలకు భోజన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని నాయకులకు ఆయన సూచించారు. అదేవిధంగా వనితకు ఘన స్వాగతం ఏ విధంగా పలకాలి, సభను, కార్యక్రమాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలి అనే విషయాలను నాయకులకు ఆయన వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, డీసీఎంఎస్ డైరెక్టర్ జంగా వెంకట కృష్ణారెడ్డి, సొసైటీ చైర్‌పర్సన్ గుర్రాల లక్ష్మణ్, నాయకులు పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, అచంట రాకేష్, బొండాడ వెంకన్నబాబు పాల్గొన్నారు.

పరిచయ వేదికను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్, పోలవరం అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల పరిచయ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం రేపల్లెవాడలోని సురేష్ ఫంక్షన్ హాల్‌లో పోలవరం నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈనెల 24న కొయ్యలగూడెంలో నిర్వహించే పరిచయ వేదికకు పార్లమెంటు అభ్యర్థి కారుమూరి సునీల్, తెల్లం రాజ్యలక్ష్మి లను వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ మిథున్ రెడ్డి శ్రేణులకు పరిచయం చేస్తారన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆళ్ల నాని అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి ఏలూరు ఎమ్మెల్యే కోటగిరి శ్రీధర్, పార్టీ సీనియర్ నాయకులతో పాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొననున్నట్లు బాలరాజు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా రెండు వేల మందికి పైగా శ్రేణుల సమీకరణకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఎంపీపీల చాంబర్ జిల్లా అధ్యక్షుడు సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆరేటి సత్యనారాయణ, దాసరి విష్ణు, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, పోలవరం, టి.నరసాపురం మండలాల కన్వీనర్లు గొడ్డటి నాగేశ్వరరావు అల్లూరి రత్నాజీ, బుగ్గా మురళి, శ్రీను రాజు, ఎంపీపీ గంజిమాల రామారావు, పార్టీ నాయకులు మంతెన సోమరాజు, నూకల రాము, గంటా శ్రీను, మట్టా సత్తిపండు, తదితరులు పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి


పంగిడిగూడెంలో పరిచయ వేదికలో పాల్గొన్న విజయరాజు

జంగారెడ్డిగూడెం రూరల్: వైఎస్సార్ సీపీ అధికారమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు పిలుపునిచ్చారు. మండలంలోని పంగిడిగూడెంలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో జరిగిన పరిచయ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. విజయరాజు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తూ వచ్చారన్నారు. సంక్షేమం, అభివృద్ధి ఇలానే కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. పార్టీలకు రహితంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పరిపాలన అందించారన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇస్తామని విజయరాజు అన్నారు. ప్రజలకు సేవ చేసుకునే అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాను పనిచేస్తానన్నారు. ప్రార్థించే పెదవులు కన్నా, సాయం చేసే చేతులు మిన్న అన్న మదర్ థెరిస్సా మాటలను తాను స్ఫూర్తిగా తీసుకుని సాటివారికి సహాయ పడాలనే ఆలోచనతో తాను ఎప్పుడూ ఉంటానని విజయరాజు అన్నారు. రాబోయే రోజుల్లో తనను అందరూ దీవించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నంబర్ 1 స్థాయిలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు, ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, పామర్రు నియోజకవర్గ పరిశీలకుడు మండవల్లి సోంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, పార్టీ నాయకులు కొప్పుల నరసింహారెడ్డి, రాఘవరాజు ఆదివిష్ణు, కొప్పుల రవిచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కఠారి సీతారాంబాబు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీల నియామకం పూర్తి

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ కొయ్యలగూడెం మండల, గ్రామ అనుబంధ కమిటీలకు కన్వీనర్లు నియామకం పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సోమవారం తెలిపారు. పార్టీ బీసీ సెల్ మండల కన్వీనర్‌గా మారిశెట్టి శ్రీనివాసరావు, మండల యూత్ కన్వీనర్‌గా యడ్లపల్లి సురేష్, ఎస్సీసెల్ విభా గం మండల కన్వీనర్‌గా దూలపల్లి కాంతారావు, ఎస్టీ సెల్ మండల కన్వీనర్‌గా కురసం మురళీకృష్ణలను జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆళ్ల నాని సూచనల మేరకు ప్రతిపాదించామన్నారు. అదేవిధంగా దిప్పకాయలపాడుకు నూనె నాగు, సరిపల్లి మండపాటి రామకృష్ణ, కన్నాపురం కాటుబోయిన సురేష్, వేదాంతపురం దండా బత్తుల సుబ్బారావు, రామానుజపురం సంకు ధర్మరాజు, సీతంపేట తారిపిరెడ్డి అప్పారావు, బయ్యన్నగూడెం బాలం వెంకటరామయ్య, రాజవరం శ్రీరంగ నిలయం కాశీ విశ్వనాథం, గంగవరం కంచర్ల సత్యనారాయణ, యర్రంపేట చింతలపూడి కిషోర్, కుంతల గూడెం కె.బాలస్వామి, పొంగుటూరు పసుపులేటి రాంబాబు, గవరవరం సీమకుర్తి సత్యనారాయణ, చొప్ప రామన్నగూడెం తగరం ఆశీర్వాదం, అచ్యుతాపురం ముమ్మిడి రాంబాబు, బోడిగూడెం తేలే నాగ శ్రీను, అంకాల గూడెం మోపిదేవి వాసు, మంగపతిదేవిపేట చిడిపి వెంకట్రావులను నియమించారు.

విజయకేతనం పుస్తకాల పంపిణీ

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ రూపొందించిన విజయకేతనం పుస్తకాలను జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ సౌజన్యంతో సోమవారం పంపిణీ చేశారు. సర్పంచ్ ప్రత్తిపాటి మహాలక్ష్మడు (యోహాను) చేతుల మీదుగా వీటిని విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్‌పర్సన్ జి.కృష్ణవేణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సురేష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గుమ్మడి శ్రీను, కె.రుక్మిణీనాధరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

చింతలపూడి: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు సూచించారు. సోమవారం స్థానిక కోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలని సూచించారు. మార్చి 3న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బీఎస్ఎన్ఎల్ రికవరీ కేసులు, కుటుంబ తగాదా కేసులు, మనోవర్తి కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, మున్సిపాలిటీ పన్ను బకాయి కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. సమాచారం కోసం దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ద్వారకాతిరుమల మండలంలో 57,910 మంది ఓటర్లు

ద్వారకాతిరుమల: మండలంలో కొత్త ఓటర్ల జాబితా సోమవారం విడుదలైంది. పురుషుల ఓట్లు కంటే మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయి. 28 పంచాయతీల్లో మొత్తం 57,910 మంది ఓటర్లు ఉండగా, అందులో మహిళా ఓటర్లు 29,257 మంది, పురుష ఓటర్లు 28,651 మంది, ఇద్దరు థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు. దీని ప్రకారం మండలంలో పురుషుల కంటే 606 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

జీలుగుమిల్లి సీఐగా క్రాంతికుమార్

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా టి.క్రాంతికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన అమలాపురం నుంచి జీలుగుమిల్లి సర్కిల్‌కి బదిలీ అయ్యారు. ఇక్కడ సీఐగా పనిచేసిన బి.వెంకటేశ్వరరావు విజయవాడ కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లారు.